ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి

కొనుగోలు కేంద్రంలో రైతుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

భూదాన్ పోచంపల్లి, మే 13 : ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. మండలంలోని పెద్దరావులపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సరైన రికార్డులు మెయింటెనెన్స్ చేయకపోవడం, డేట్ రిజిస్ట్రేషన్, బస్తాలపై నెంబర్లు వేయకపోవడంతో నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు. ఆయన వెంట ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, ఇన్‌చార్జి తాసీల్దార్ నాగేశ్వర్‌రావు, ఏఓ శైలజ, సివిల్ సప్లయ్ డీటీ బాలమణి, ఆర్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రక్తహీనతతో అనారోగ్యానికి గురికాకుండా జాగ్రత్త వహించాలి : డీఎంహెచ్‌ఓ

సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ డాక్టర్ మనోహర్

భువనగిరి అర్బన్, మే 13 : రక్తహీనతతో ఏ ఒక్కరూ అనారోగ్యానికి గురికాకూడదని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మనోహర్ అన్నారు. వైద్యారోగ్య జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం ఆశ నోడల్ ఆఫీసర్, ఫెసిలిటేటర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రాల్లో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలు, పాలిచ్చే తల్లులు, గర్భవతులకు రక్తహీనత లేకుండా ఎప్పటికప్పుడు తగిన పరీక్షలు నిర్వహించి చికిత్స అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ప్రాథమిక ఆరోగ్య సేవలన్నింటినీ హెల్త్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లోఎంట్రీ చేయాలన్నారు. ప్రాథమిక స్థాయిలో గర్భవతులను గుర్తించి వెంటనే రిజిస్ట్రేషన్ చేసి ప్రసూతి అయ్యే వరకు ఆరోగ్య సేవలు అందించాలని సూచించారు. గర్భం దాల్చిన ప్రతి మహిళా ప్రభుత్వ దవాఖానలో ప్రసవించేలా ప్రోత్సహించాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిల్పిని మాట్లాడుతూ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో జరిగే కార్యక్రమాలను సమీక్ష నిర్వహించామన్నారు. ఆశ కార్యకర్తలందరూ వ్యాధులపై ఎప్పటికప్పుడు జాగ్రత్తగా ఉండి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిలో ఎండలు అధికంగా ఉన్నందున రైతు కూలీలకు, పొలం పనులు చేసుకునే వారికి, కూలి పనులు చేసుకునే వారికి ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయాలని ఆదేశించారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో 21నుంచి 28వరకు ఇంటెన్సీ మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. ఆశ నోడల్ అధికారి సత్యవతి, సత్యనారాయణ, ఆశ నోడల్ ఆఫీసర్, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

టీబీ వ్యాధి నివారణలో సీవై - టీబీ పరీక్ష కీలకం

సీవై-టీబీ టెస్ట్‌ను పర్యవేక్షిస్తున్న జిల్లా ఉప వైద్యాధికారి యశోద

చౌటుప్పల్, మే 13 : టీబీ వ్యాధి నివారణలో సీవై – టీబీ పరీక్ష కీలక పాత్ర పోషిస్తుందని జిల్లా ఉప వైద్యారోగ్య శాఖ అధికారి యశోద అన్నారు. చౌటుప్పల్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్, తంగడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఈ పరీక్షలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురికి పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీవై – టీబీ టెస్ట్‌తో వ్యాధిని కచ్చితంగా గుర్తించవచ్చన్నారు. వ్యాధి ఉన్నవారితో దగ్గరగా ఉండే కుటుంబ సభ్యులకు ఈ పరీక్ష ద్వారా వ్యాధిని త్వరగా నిర్ధారించవచ్చని తెలిపారు. తద్వారా ముందుస్తుగా వ్యాధి రాకుండా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి సీహెచ్ కాటంరాజు, హెచ్ఈ వసంత కుమారి, బీబీ సూపర్‌వైజర్ శ్రీనివాస్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు సరళ, వేణు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలను పరిష్కరించుకోవాలి

సదస్సులో మాట్లాడుతున్న తాసీల్దార్ లావణ్య

ఆత్మకూరు(ఎం), మే 13 : రెవెన్యూ సదస్సుల ద్వారా రైతులందరూ తమ భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తాసీల్దార్ లావణ్య అన్నారు. మండలంలోని మొరిపిరాల, పల్లెపహాడ్ గ్రామాల్లో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సుల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించి జూన్ 2 తర్వాత వాటిన పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ తాసీల్దార్ సఫియొద్దీన్, ఆర్ఐలు మల్లికార్జున్‌రావు, పాండు పాల్గొన్నారు.

గాంజా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

భువనగిరి అర్బన్, మే 13 : గాంజా విక్రయిస్తున్న ఓ అనుమానితుడిని పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సాయిబాబా దేవాలయం సమీపంలో గల ఓ షాపులో గాంజా విక్రయిస్తున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారంతో షాపు యజమానిని అరెస్టు చేశారు. అతని వద్ద నాగ్‌పూర్ నుంచి తీసుకొచ్చిన 0.138 గ్రాముల గాంజా, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్ఐ కుమార స్వామి తెలిపారు.

నిరుపేదకు చేయూత

ఆలేరు టౌన్, మే 13 : పట్టణంలోని చింతల్‌బస్తీకి చెందిన మొరిగాడి సత్తమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేశం గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ అందజేసిన 50కిలోల బియ్యం బ్యాగ్‌ను ఆ కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బేతి రాములు, రాజేశ్‌గౌడ్, రామకృష్ణ, సత్తయ్య, ఆనంద్‌గౌడ్, భిక్షమయ్య యువసేన అధ్యక్షుడు గోరెమియా, సంతోష్, ఎండీ ఫయాజ్, వెంకటేశ్, శ్రీనివాస్, రమేశ్ పాల్గొన్నారు.

గీత కార్మికుడి కుటుంబానికి కుట్టు మిషన్ అందజేత

లావణ్యకు కుట్టు మిషన్ అందజేస్తున్న నాయకులు

ఆలేరు రూరల్, మే 13 : మండలంలోని శారాజీపేటలో ఇటీవల తాటిచెట్టు పైనుంచి పడి మృతిచెందిన దూడల ఆంజనేయులు కుటుంబానికి కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా ఆధ్వర్యంలో మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. ఆంజనేయులు భార్య లావణ్యకు రూ.20వేల విలువైన కుట్టుమిషన్‌తోపాటు రూ.10వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొలగాని జయరాములుగౌడ్, నాయకులు దూపటి వెంకటేశ్, దూడల లక్ష్మణ్, రవి పాల్గొన్నారు.

రేపు యాదగిరీశుడి చెంతకు అందగత్తెలు

- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ హనుమంతరావు

పోచంపల్లి : చేనేత స్టాల్ ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న కలెక్టర్ హనుమంతరావు, అధికారులు

యాదగిరిగుట్ట, మే 13 : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి చెంతకు ఈ నెల 15న మిస్ వరల్డ్ కాంటెస్ట్‌లో పాల్గొనే ప్రపంచ సుందరీమణులు రానున్నట్లు కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. గురువారం సాయంత్రం 5నుంచి 7గంటల వరకు స్వామివారిని దర్శించుకుంటారని వెల్లడించారు. ఈ నేపథ్యంలో మంగళవారం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పర్యటనను ప్రశాంతంగా కొనసాగించేందుకు ఏర్పాట్లను పరిశీలించి దేవస్థాన అధికారులతో సమీక్ష జరిపి పలు సూచనలు చేశారు. దర్శనానికి వచ్చే అతిథులకు ఇబ్బందులు, ఆటంకాలు రాకుండా చూడాలన్నారు. అనంతరం విలేకరులతో కలెక్టర్ మాట్లాడుతూ సుమారు 2గంటల పర్యటనలో కొండపైన వీవీఐపీ అతిథి గృహం నుంచి అఖండ దీపారాధనలో పాల్గొని, తూర్పు రాజగోపురం గుండా ఆలయంలోకి ప్రవేశించి స్వామివారికి పూజలు నిర్వహిస్తారని తెలిపారు. దేవస్థాన టూరిజానికి ఇది మంచి అవకాశమన్నారు. ఈ పర్యటనతో యాదగిరిగుట్ట ఆలయం ప్రపంచ స్థాయిలో మంచి గుర్తింపు పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణారెడ్డి, ఆలయ ఈఓ వెంకట్‌రావు, డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, ఈఈలు రామారావు, దయాకర్‌రెడ్డి, ఇన్‌చార్జి తాసీల్దార్ దేశ్యా పాల్గొన్నారు.

పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలకు అంతర్జాతీయ ప్రమోషన్

భూదాన్ పోచంపల్లి : ఆధునిక వస్త్ర ప్రపంచంలో పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలు ఫ్యాషన్ స్టైల్‌గా మారడంతో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొంది మార్కెట్ సదుపాయాలు పెరుగనున్నాయని, దీంతో అంతర్జాతీయ స్థాయిలో ప్రమోషన్ లభిస్తుందని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. టూరిజం శాఖ జీఎం ఉపేందర్‌రెడ్డి, జడ్పీ సీఈఓ శోభారాణి, డీపీఓ సునందతో కలిసి మంగళవారం గ్రామీణ పర్యాటక కేంద్రాన్ని సందర్శించారు. ప్రధాన ద్వారం స్వాగత తోరణాలు, స్టాల్ ఏర్పాట్లు, మ్యూజియం, మగ్గాల ప్రదర్శన, హంపి థియేటర్‌లో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి ఏర్పాట్లపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 15న పోచంపల్లికి పది దేశాలకు చెందిన 25 మంది మిస్ వరల్డ్ పోటీదారులు రానున్నారని తెలిపారు. ఇక్కత్ వస్త్రాలతో మోడల్స్ నిర్వహించే ర్యాంప్ వాక్ నేతన్నలకు వరంగా మారనున్నదని తెలిపారు. కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ ఏడీ శ్రీనివాసరావు, ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అంజన్‌రెడ్డి, ఇన్‌చార్జి తాసీల్దార్ నాగేశ్వర్‌రావు, ఎంపీడీఓ భాస్కర్ గౌడ్, ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ ప్రభాకర్‌రెడ్డి, చౌటుప్పల్ సీఐ రాములు, స్థానిక ఎస్ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డి, మండల వైద్యాధికారి శ్రీవాణి, ఈవెంట్ ప్రతినిధి సతీశ్, ఆర్ అండ్ బీ, ట్రాన్స్‌కో ఏఈలు లింగయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సుందరీమణుల రాకకు పర్యాటక గ్రామంలో ఏర్పాట్లు

లైటింగ్ ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

భూదాన్ పోచంపల్లి, మే 14 : ఉత్తమ పర్యాటక గ్రామంగా అంతర్జాతీయ అవార్డు పొందిన భూదాన్ పోచంపల్లికి ప్రపంచ సుందరీమణులు ఈ నెల 15న రానున్న సందర్భంగా రాష్ట్ర పర్యాటక శాఖ విస్తృత ఏర్పాట్లు చేస్తుంది. వారి రాక కోసం టూరిజం పార్కులో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. పోచంపల్లిలో ప్రత్యేక ఆకర్షణీయమైన ఆర్చీలు, స్వాగత తోరణాలతో ఆయా మార్గాలను అందంగా తీర్చిదిద్దడంతో పాటు విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. పర్యటనలో గుర్తింపు పొందిన ప్రాంతాల్లో హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. పోచంపల్లి ఇక్కత్ చీరెలు ధరించి ర్యాంప్ వాక్ చేసేలా కార్యక్రమాలను రూపొందిస్తున్నారు. టూరిజం బస్సులో 25 మంది సుందరీమణుల బృందం గురువారం సాయంత్రం 6గంటలకు పోచంపల్లికి చేరుకుంటారు. ఇక్కడ రెండు గంటలసేపు గడిపి రాత్రి 8గంటలకు హైదరాబాద్‌కు వెళ్తారు. అడుగడుగునా ఇక్కత్ థీమ్ ఉట్టిపడేలా ఏర్పాట్లు, టూరిజం ప్రధాన ద్వారం నుంచి లోపల మ్యూజియం వరకు మహిళలు కోలాటంతో స్వాగతం పలుకనున్నారు. టూరిజం లోపల లైవ్ మ్యూజిక్ , చేనేత వస్త్ర తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా తిలకిస్తారు. టూరిజం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎడ్ల బండిని, తెలంగాణ సాంప్రదాయానికి ప్రతీక అయిన బతుకమ్మను పేర్చుతూ మహిళలు పాటలు పాడుతారు. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ స్వాతి రూపొందించిన ఇండో వెస్ట్రన్ ఇక్కత్ వస్త్రాలతో మోడల్స్ ర్యాంప్ వాక్ నిర్వహిస్తారు. టూరిజం ప్రాంగణం ఇరువైపులా పల్లె వాతావరణం ప్రతిబింబించేలా గుడిసెల సెట్‌లో చేనేత స్టాల్‌ను పరిశీలిస్తారు. పది స్టాల్స్‌లో పోచంపల్లి ఇక్కత్ స్టాల్స్ ఏడు, మిగతావి గద్వాల, సిద్దిపేట, గొల్లభామ, నారాయణపేట స్టాల్స్ ఉంటాయి. దారం నుంచి వస్త్రం తయారీ వరకు ఎలా తయారవుతుందో ప్రక్రియను స్థానిక చేనేత మహిళలు వివరిస్తారు. పోచంపల్లిలో భారీ బందోబస్తు, పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు.

గుండాల తాసీల్దార్‌గా శేషగిరిరావుకు అదనపు బాధ్యతలు

గుండాల, మే 13 : మండల తాసీల్దార్‌గా శేషగిరిరావు మంగళవారం అదనపు బాధ్యతలు స్వీరించారు. ఇక్కడి తాసీల్దార్ జలకుమారి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. ఆమె బాధ్యతలను నాయబ్ తాసీల్దార్ నీలిమకు ఇవ్వగా.. ఇటీవల ఆమె కూడా సెలవుపై వెళ్లారు. దాంతో కార్యాలయంలో భూ రిజిస్ట్రేషన్లు, పౌర సేవలు నిలిచిపోవడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు అడ్డగూడూర్ తాసీల్దార్ శేషగిరిరావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. నేటి నుంచి రిజిస్ట్రేషన్లు, పౌర సేవలు కొనసాగుతాయని శేషగిరిరావు తెలిపారు.

ఆల్ స్టైల్స్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ జిల్లా జాయింట్ సెక్రటరీగా చెన్నకేశ్వర్

రామన్నపేట, మే 13 : ఆల్ స్టైల్స్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ జిల్లా జాయింట్ సెక్రటరీగా పట్టణ కేంద్రానికి చెందిన అప్పం చెన్నకేశ్వర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భువనగిరిలో మంగళవారం జరిగిన ఎన్నికల్లో తనను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. 32 సంవత్సరాలుగా కరాటే ఫీల్డ్‌లో ఉంటూ విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. నేటి యువత యుద్ధ క్రీడల్లో నైపుణ్యాన్ని సాధించాలని పిలుపునిచ్చారు.

గిరిజన గురుకులంలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

సంస్థాన్ నారాయణపురం, మే 13 : మండల కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ విభాగంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ లింగస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు ఈ నెల 15న మిర్యాలగూడలోని అవంతీపురం బాలుర గురుకుల పాఠశాలలో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సంబంధిత పత్రాలతో కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

'అందాల పోటీలను ప్రతిఘటిద్దాం'

భూదాన్ పోచంపల్లి, మే 13 : స్త్రీ ఆత్మగౌరవాన్ని భంగ పరిచే అందాల పోటీలను ప్రతిఘటించాలని ప్రగతిశీల యువజన సంఘం పట్టణ కార్యదర్శి పగడాల శివ మహిళలకు పిలుపునిచ్చారు. పట్టణంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం అప్పుల ఊబిలో మగ్గుతుంటే అందాల పోటీలు ఎందుకని ప్రశ్నించారు. పోచంపల్లిలో అర్ధాకలితో అలమటిస్తున్న చేనేత మహిళల బాధలు ఎందుకు పట్టడం లేదని ప్రశ్నించారు. ఇంటిల్లిపాది పనిచేసినా చీరెలు అమ్ముడుపోక సరైన గిట్టుబాటు ధర లభించక చేనేత కార్మికులు కూలి పనులకు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందాల భామలతో ర్యాంపు వాక్‌లు, సందర్శనలు చేసినంత మాత్రాన సమస్యలు పరిష్కారం కావన్నారు. చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, కార్మికుల జీవన పరిస్థితులు మార్చే విధంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'సిబిల్ స్కోర్‌తో ఇబ్బందులు పడాల్సిందే'

చౌటుప్పల్, మే 13 : రాజీవ్ యువ వికాస్ పథకానికి బ్యాంక్ సిబిల్ స్కోర్ ఆధారంగా అర్హుల ఎంపిక జరిగితే నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు పడాల్సిందేనని సామాజిక కార్యకర్త దబ్బేటి శేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యక్తిగత, వ్యవసాయ, గృహ, వాహన రుణాలు తీసుకుని తిరిగి చెల్లించని నిరుపేదలు ఎంతోమంది ఉన్నారని తెలిపారు. ఈ క్రమంలో సిబిల్ స్కోర్ కొర్రీ పెడుతూ కొంత మందికి రుణాలు ఇచ్చి చేతులు దులుపుకోవాలని కాంగ్రెస్ సర్కారు చూస్తుందని విమర్శించారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకొని అర్హులందరికీ పథకం అందేలా చూడాలని కోరారు.

'ఉపాధి హామీ కూలీలకు రూ.600 చెల్లించాలి'

ఉపాధి హామీ కార్మికులతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి స్వామి

వలిగొండ, మే 13 : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్న కూలీలకు కొలతలతో సంబంధం లేకుండా రోజుకు రూ.600 కూలి చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సిర్పంగి స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని నాగారం గ్రామంలో మంగళవారం ఉపాధి హామీ పనులను పరిశీలించి మాట్లాడారు. ఉపాధి హామీ పనులు చేస్తున్న కార్మికులకు కొలతలతో సంబంధం లేకుండా ప్రతి కూలీకి 600 రూపాయలు చెల్లించాలని, పని ప్రదేశంలో కార్మికులకు సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక, స్వచ్ఛంద సంస్థలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కేవీపీఎస్ మండల సహాయ కార్యదర్శి గొల్ల శివ, నాయకులు పాండు, శంకరయ్య, స్వామి, వెంకటమ్మ, సబిత, పార్వతమ్మ పాల్గొన్నారు.

క్రికెట్ సమ్మర్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

క్రికెట్ సమ్మర్ కోచింగ్‌లో పాల్గొన్న క్రీడాకారులు

భువనగిరి అర్బన్, మే 13 : క్రికెట్ సమ్మర్ ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా సమ్మర్ క్రికెట్ ఉచిత కోచింగ్ సెక్రటరీ అమీన్ బాబా అన్నారు. భువనగిరి పట్టణంలోని కాలేజీ గ్రౌండ్‌లో మంగళవారం ఉచిత సమ్మర్ కోచింగ్ క్రికెట్ క్యాంపును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్యాంపునకు దాదాపు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. రోజూ విద్యార్థులకు పండ్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జిల్లా ఇన్‌చార్జీలు రావుల సతీశ్, కేతాన్ పాల్గొన్నారు.

వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

భువనగిరి అర్బన్, మే 13 : విద్యార్థుల కోసం ఈ నెల 15నుంచి 31వరకు భువనగిరి మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల బీచ్‌మహల్, జూనియర్ కాలేజీ హైస్కూల్, బస్వాపూర్, రాయగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో వేసవి శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ నాగవర్ధన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ శిబిరంలో ఉదయం 8నుంచి 11గంటల వరకు వివిధ అంశాలపై నిపుణులు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రోజూ ఉదయం 8నుంచి 9:30 గంటల వరకు చెస్, క్యారమ్, కరాటే, యోగా, స్కిప్పింగ్, డ్రాయింగ్, రింగ్‌బాల్, వాలీబాల్, ఫుట్‌బాల్ తదితర క్రీడలపై శిక్షణ ఇస్తారని తెలిపారు. విద్యార్థులు తమకు ఇష్టమైన క్రీడల్లో పాల్గొనవచ్చునని వివరించారు. ఉదయం 9:45 నుంచి 11గంటల వరకు తెలుగు, హిందీ, ఇంగ్లిషు, గణితం, సైన్స్, సోషల్, సబ్జెక్టులపై బేసిక్స్ బోధిస్తారని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పదో తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందన

చందంపేట(దేవరకొండ), మే 13 : దేవరకొండ పట్టణంలోని రవీంద్ర భారతి పాఠశాలలో పదో తరగతి లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను మంగళవారం దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణతోకూడిన విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కొర్ర రాంసింగ్ నాయక్, కిన్నెర హరికృష్ణ, పాఠశాల చైర్మన్ లెంకల సత్యనారాయణరెడ్డి, కరస్పాండెంట్ లెంకల లక్ష్మి, హెచ్ఎం కుందూరు వెంకట్‌రెడ్డి, గుంటోజురామకృష్ణ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు : డీఏఓ

సమావేశంలో మాట్లాడుతున్న డీఏఓ గోపాల్

భువనగిరి అర్బన్, మే 13 : నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్, అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ హెచ్చరించారు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం వ్యవసాయ, పోలీస్ శాఖ అధికారులు సంయుక్తంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నకిలీ విత్తనాలను అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. వ్యవసాయ, పోలీస్ శాఖ అధికారులతో స్పెషల్ స్క్వాడ్స్ ఏర్పాటు చేశారు. ఈ బృందాలు నకిలీ విత్తనాలు అమ్మే వారిపై నిఘా పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటాయన్నారు. డీఏఓ గోపాల్ మాట్లాడుతూ విత్తన లైసెన్స్ కలిగిన డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేసిన విత్తనాలకు తప్పనిసరిగా రసీదు పొందాలని, దానిని పంట కాలం ముగిసేవరకు జాగ్రత్త పరుచాలని రైతులకు సూచించారు. విత్తన నాణ్యత లోపం వల్ల జరిగే పంట నష్టాన్ని నిర్ధారించి పరిహారం ఇప్పించడానికి కొనుగోలు రసీదు ఉపయోగపడుతుందని తెలిపారు. పత్తి విత్తన ప్యాకెట్‌పై ప్యాకింగ్ తేదీని సరిచూసుకోవాలన్నారు. అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఎంఆర్‌పీ కంటే ఎక్కువకు అమ్మితే మండల వ్యవసాయ అధికారికి తెలియజేయాలని సూచించారు. ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మడానికి ప్రయత్నిస్తే వ్యవసాయ, పోలీస్ అధికారులకు తెలియజేయాలన్నారు. సమావేశంలో వ్యవసాయ, పోలీస్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : ఎస్ఐ దేవేందర్

వాహనాల తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

రాజాపేట, మే 13 : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని యాదగిరిగుట్ట ట్రాఫిక్ ఎస్ఐ దేవేందర్ సూచించారు. మండలంలోని నెమిలె క్రాస్ రోడ్ వద్ద మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనదారుల హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ, ఇన్సూరెన్స్ పత్రాలను, పెండింగ్ చలాన్లను పరిశీలించారు. హెల్మెట్ ధరించకుండా, పత్రాలు లేని వాహనదారులకు చలాన్లు విధించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి, విజయ, నవీన్‌కుమార్, నరేశ్ పాల్గొన్నారు.

దాతల సహకారంతో నెరవేరిన సొంతింటి కల

దాతల సహకారంతో నిర్మించిన ఇంట్లో బాలనర్సమ్మ

రాజాపేట, మే 13 : ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అని నిరూపించారు. రాజాపేట మండల కేంద్రానికి చెందిన సిరిపంగ బాలనర్సమ్మ భర్త శివయ్య పదేండ్ల క్రితం మృతి చెందాడు. అప్పట్లో ఆమెకు చిన్న పెంకుటిల్లు ఉండేది. వర్షాలకు, కోతుల బెడదతో పెంకుటిల్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని కూలిపోయింది. ఉండడానికి ఇల్లు లేక మూడేండ్లుగా బాత్రూమ్‌లోనే కాలం వెళ్లదీసింది. గమనించిన కాలనీ యువకులు మండల సోషల్ మీడియాలో పెట్టగా..